క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని నిరుపేదలకు వైఎస్సార్‌సీపీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు రవి ప్రసాద్ నిత్యావసర సరుకులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు తమ వంతు బాధ్యతగా బియ్యం, కందిపప్పు,నూనె, సబ్బులు,పాలు, లాంటి నిత్యావసరాలు అందజేశామన్నారు. అలాగే వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్, రషీద్, యునుస్, సుల్తాన్, ముర్తుజా, విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేసీలో తగ్గుతున్న నీటిమట్టం



జూపాడుబంగ్లా: కర్నూలు-కడప కాల్వలో క్రమేణా నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. తుంగభద్ర డ్యాం నుంచి సుంకేసుల జలాశయంలోకి 900 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతుండగా డ్యాంలో ఒక టీఎంసీ నీళ్లు నిల్వ ఉన్నట్లు కేసీ కాల్వ ఏఈ నరేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల జలాశయం కేసీ కాల్వకు 600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీరు లాకిన్స్‌లా వరకు 200 క్యూసెక్కులు చేరుతుండగా, అందులో 120 క్యూసెక్కులు నిప్పులవాగుకు, 80 క్యూసెక్కులు తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు విడుదలచేస్తున్నట్లు వెల్లడించారు. మరో వారం రోజులపాటు కేసీ కాల్వకు సాగునీరు సరఫరా అయ్యే అవకాశాలున్నాయని ఏఈ తెలిపారు.

రేపు ఆలయ భూముల కౌలుకు వేలం

కొత్తపల్లి: మండల కేంద్రంలో వెలసిన శ్రీ తాండవమల్లేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానములకు చెందిన భూముల బహిరంగ కౌలువేలం ఈనెల 3న నిర్వహిస్తున్నట్లు ఈఓ కార్తీక్ శనివారం తెలిపారు. మొత్తం 63.12 ఎకరాలకు వేలం జరగనున్నట్లు తెలిపారు. పాల్గొన దలచిన వారు రూ.2000 డిపాజిట్ చెల్లించాలని వివరించారు. వేలం పాటలో భూములు సొంత చేసుకున్నవారికి సంవత్సరం వరకు కాలపరిమితి ఉంటుందని వెల్లడించారు. ఈ వేలంపాటలో కేవలం హిందుమతస్తులు మాత్రమే పాల్గొనాలని స్పష్టం చేశారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



విద్యుత్ స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వెలుగు చూసిన సమస్యలకు పరిష్కారం లభించింది. ఇటీవల ఎమ్మెల్యే వెలుగోడు పట్టణంలోని 10వ వార్డు తాజ్ నగర్‌లో పర్యటించిన సమయంలో స్థానికులు విద్యుత్ స్తంభాల కొరతను ఆయన దష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన..విద్యుత్ అధికారులకు ఆదేశించడంతో శనివారం తాజ్ నగర్‌లో 8 విద్యుత్ స్తంభాలను విద్యుత్ ఏఈ రవీంద్రనాయక్ ఏర్పాటు చేయించారు. స్తంభాలను వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ దగ్గరుండి ఏర్పాటు చేయించారు. స్తంభాల ఏర్పాటు పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్ రెడ్డి, షంషీర్, రమణ, ఖాదర్ వలి, మొహమ్మద్ హుస్సేన్, బాషా, అన్సర్, తాజ్ నగర్ తదితరులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చర్యలు

వెలుగోడు: ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో బ్రహ్మంనాయక్ తెలిపారు. గతానుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ముందు నుంచే అన్ని జాగ్రత్తలూ తీసుకున్నామన్నారు. మండలంలో 3 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వెలుగోడు జెడ్పీ హైస్కూల్‌లో 209 మంది విద్యార్థులు పరీక్ష రాస్తారని, ఈ సెంటర్‌కు రూతు నల్లి చీఫ్ ఎగ్జామినర్‌గా ఉంటారన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో 210 మంది పరీక్షలు రాస్తారని, చీఫ్‌గా నళిని వ్యవహరిస్తారన్నారు. డీపాల్ హైస్కూల్‌లో 220 మంది పరీక్షలు రాయనుండగా రవి కుమార్‌ను చీఫ్ ఎగ్జామినర్‌గా నియమించారని చెప్పారు.

తర్తూరు తిరునాలకు వేళాయే

- 4న గజవాహన సేవ
- 5న రథోత్సవం
- జాతరకు సిద్ధమవుతున్న దుకాణాలు, రంగులరాట్నాలు



వెదురు నిచ్చెనలు, తడకలు, నిచ్చెనలు తయారు చేస్తున్న మేదరులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే జాతరకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పేరుంది. పక్షం రోజుల పాటు జరిగే జాతరలో పేదవాడి నుంచి ధనికుని అవసరమైన వంటింటి సామగ్రితో పాటు పలురకాల వస్తువులు లభిస్తాయి. తర్తూరు జాతర నెల 4న జరిగే స్వామివారి గజవాహనసేవ నుంచి జాతర పూర్తిస్థాయిలో సంతరించుకుంటుంది. 5న జరిగే రథోత్సవం అనంతరం వస్తువుల క్రయ, విక్రయాలు ఊపందుకుంటాయి.

రైతు జాతర

ఈ జాతర వ్యవసాయ పరికరాలకు ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ వ్యవసాయానికి అవసరమైన నాగలి, గుంటిక, తడిక, పొనక ఎద్దులకు మువ్వలు, గంటలు తదితర పరికరాలు లభిస్తాయి. అంతేకాకుండా ఎద్దుల క్రయ, విక్రయాలు జాతరలో భారీ ఎత్తున జరుగుతాయి. జాతరలో మాంసపు కడ్డీలు ఎంతో ప్రసిద్ధి. పలురకాల వస్తువులు కొనుగోలు చేసిన అనంతరం కడుపారా భుజించేందుకు ఎంతో రుచికరమైన మాంసపు కడ్డీలు లభిస్తాయి. జాతరకు వచ్చిన భక్తులు కడ్డీల రుచిచూడకుండా వెనుదిరగరు. జాతరలో బొమ్మల అంగళ్లు, వంటింటి సామగ్రి దుకాణాలు, గాజుల దుకాణాలు పలురకాల వస్తువులతో కూడిన దుకాణాలు, రంగులరాట్నాలు, జాయింట్‌వీల్, బ్రేక్‌డాన్స్ వంటి వినోద పరికరాలతో అంగళ్లను ముస్తాబుచేస్తున్నారు. మరో మూడు రోజుల్లోగా తర్తూరు జాతర పూర్తిస్థాయిలో రూపుసంతరించుకుంటుంది.



వినోదింపజేసేందుకు ముస్తాబైన జాయింట్‌వీల్

శేషవాహనంపై దర్శనమిచ్చిన శ్రీలక్ష్మీరంగనాథుడు

తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గొవ రోజైన శనివా రం స్వామి వారు శేషవాహనం (నాగేంద్రుని వాహనం)పై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేషపూజలు నిర్వహించారు. వేదమంత్రాల మధ్య గోవిందనామస్మరణ చేస్తూ స్వామి వారిఉత్సవ విగ్రహాన్ని మల్లెలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించారు. భాజాభజంత్రీలతో భక్తులు స్వామివారి పల్లకీని మోసుకుంటూ శేషవాహనంతో అలంకరించిన ప్రభోత్సవ రథం వద్దకు తీసుకెళ్లారు. ప్రభపై స్వామిని అధిష్ఠింపజేసి భక్తుల జయజయ ధ్వానాల మధ్య గ్రామ వీధుల్లో తిప్పారు.

శేషవాహనానికి విశిష్టత

స్వామివారి బ్రహ్మోత్సవాల్లోని శేషవాహనోత్సవానికి విశిష్టత ఉంది. శేషవాహనసేవనాడు శ్రీలక్ష్మీరంగనాథస్వామి వారికి మల్లెలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటే ఏడాదంతా తమకు సర్పగండం తొలగిపోతుందనేది భక్తుల నమ్మకం. అందులోభాగంగా ప్రజలు, రైతులు పొలంగట్లవెంట తిరిగేటప్పుడు నాగుపాముల నుంచి తమకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా శేషవాహనసేవ నాడు స్వామివారికి మల్లెపూలలను సమర్పించి ప్రత్యేకంగా మొక్కులు తీర్చుకుంటారు.భక్తులు సమర్పించే మల్లెలతో స్వామి, అమ్మవారి మూలవిగ్రహాలు నిండిపోయాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజైన ఆదివారం హనుమద్వాహనసేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి తెలిపారు.



మల్లెలతో నిండిపోయిన స్వామివారి విగ్రహం,



స్వామివారి ప్రభను లాగుతున్న భక్తులు

భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలి

మహానంది: టోల్గేట్ నిర్వహణ సిబ్బంది భక్తులతో మర్యాదపూర్వకంగా మెలగాలని మహానంది ట్రస్టు బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. అబ్బీపురం గ్రామానికి చెందిన శవ్వా మనోహర్‌రెడ్డి రూ.1.40కోట్లతో టోల్గేట్ నిర్వహణను దక్కించుకున్న నేపథ్యంలో శనివారం పూజలు నిర్వహించి టోల్ వసూలును ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ యశ్వస్విని, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, మండల నాయకులు బుడ్డా రెడ్డి శ్రీనివాసరెడ్డి, శరభారెడ్డి, మధుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం పోరాడుదాం

జూపాడుబంగ్లా: బహుజన రాజ్యాధికారం తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పోరాడాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ నాయకుడు ఎల్ స్వాములు పిలుపునిచ్చడు. శనివారం ఆయన జూపాడుబంగ్లాలో బీఎస్పీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ బ్రాహ్మణవాద పార్టీగా, టీడీపీ కమ్మరెడ్ల పార్టీలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. బాలస్వామి, ప్రభాకర్, చిన అజయ్, ఉమేష్ పాల్గొన్నారు.

చోరీ ఘటనపై అన్ని కోణాల్లో విచారణ

బండిఆత్మకూరు: మండలకేంద్రం సమీపంలో గురువారం రాత్రి కేసీ కెనాల్ వద్ద జరిగిన చోరీ సంఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. సింగవరం గ్రామానికి చెందిన ధనుంజయగౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆగంతకులు సెల్‌ఫోన్‌ను లాక్కొని ఫోన్‌పే యాప్ ద్వారా ఖాతాలో నిల్వ ఉన్న నగదును కూడా తీసుకెళ్లడంపై పోలీసులు విస్మయం చెందుతున్నారు. దీంతో పోలీసులు టెక్నాలజీని వినియోగించుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వీడండి



ఖాజీపేట జగనన్న లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ , వైకేపీ పీడీ శ్రీధర్‌రెడ్డి

మిడుతూరు: విధి నిర్వహణలో అలసత్వం వీడి బాధ్యాతాయుతంగా పనిచేయాలని డీఆర్‌డీఏ, వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చింతలపల్లి, ఖాజీపేట, 49-బన్నూరు , నాగలూటి, మాసపేట, కలమందలపాడు తదితర గ్రామాల్లో పర్యటించి జగనన్న గోరుముద్ద, జగనన్న లే -అవుట్లలో ఇంటి నిర్మాణాలు, నాడు-నేడు పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో నాడు-నేడు పనులు, ఇళ్ల నిర్మాణాలు, జగనన్న గోరు ముద్ద తదితర వాటిని తనిఖీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో నాడు నేడు పనులను వేగవంతం చేయడంతోపాటు నాణ్యతాయుతంగా చేపట్టాలని సూచించారు. అదేవిధంగా జగనన్న గోరుముద్దలో భాగంగా విద్యార్థులకు రుచికరంగా వండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. పాఠశాలలో గుడ్డు నాణ్యతను పరిశీలించారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా చైతన్యం తీసుకరావాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, ఏపీఎం సుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వనాథ్, హౌసింగ్ ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం వండిపెట్టాలి

జూపాడుబంగ్లా: ప్రభుత్వ మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని పాఠశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లకు ప్రత్యేకాధికారి ఎంఎస్‌వీ రాజు సూచించారు. జిల్లా కలెక్టర్ మనజీర్‌జిలానీ ఆదేశాల మేరకు జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంటు అధికారి ఎంఎస్‌వీ రాజు శనివారం మండలంలోని మోడల్ పాఠశాల, తాటిపాడు ఎంపీయూపీ, మండ్లెం ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. అలాగే జూపాడుబంగ్లా, తంగడంచ, మండ్లెం జగనన్న కాలనీలను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ చార్టుతో పాటు మధ్యాహ్నం విద్యార్థులకు వండిన ఆహారపదార్థాలను పరిశీలించారు. విద్యార్థులకు సరఫరా చేస్తున్న గుడ్లు, చిక్కీలు నాణ్యతమైనవిగా ఉంటేనే తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లోని మినరల్ వాటర్‌ప్లాంట్లు పనితీరు, లెట్రిన్ల పరిశుభ్రతను పరిశీలించారు. ఎంఈఓ మోహన్, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, పీఆర్ ఏఈ బషీర్, సీఆర్పీ కిరణ్ తదితరులు ఉన్నారు.



గుడ్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఎంఎస్‌వీ రాజు

ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

నందికొట్కూరు: ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పని సరి అని వైఎస్సార్ సీపీ నాయకుడు చంద్రమౌళి అన్నారు. శనివారం పట్టణంలోని ఓ పంక్షన్ హాల్‌లో ఎల్‌ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వేల్పుల ఆనందరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పలువురు అధికారులు, రాజకీయ నాయకులు, బంధువులు ఆనందరావును సన్మానించారు. కార్యక్రమంలో కడప ఎల్ఐసీ డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ శంకర్ నాయక్, కడప డెవలప్‌మెంట్ ఆఫీసర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రాజశేఖర్, రిటైర్డు డీఎస్పీలు జయచంద్ర, పీఎన్ బాబు, సింగిల్ విండో చైర్మన్ తులసిరెడ్డి, సర్పంచు స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి

భూములపై పెత్తనం తగ్గించాలి

పగిద్యాల: కృష్ణానది పరివాహకం వెంట లోతట్టు భూములపై పీకే ప్రాగటూరు గ్రామస్తుల పెత్తనం తగ్గించి నోటీసులు జారీ చేయాలని ఇదే గ్రామానికి చెందిన కర్రెన్న, శేషన్న, శివన్న, వెంకటేశ్వర్లు, పెద్ద మల్లయ్య, రామాంజనేయులు, నరసింహుడుతో పాటు మరి కొందరు శనివారం తహసీల్దార్ భారతికి వినతి పత్రం అందజేశారు. గతంలో జరిగిన పంచాయతీ ప్రకారం ప్రకారం తమ భూములకు ఎదురుగా నదిలో తట్టు వరకు తామే సాగు చేసుకుంటామని పీకే ప్రాగటూరు పెద్దమనుషులకు నోటీసులు జారీ చేయాలని కోరారు.

మౌలిక వసతులు కల్పించాలి

బండిఆత్మకూరు: మండలంలోని జగనన్న కాలనీల్లో అధికారులు మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పార్టీ నాయకులు రత్నమయ్య, రాజేష్ కోరారు. శనివారం బండిఆత్మకూరులో ఉన్న జగనన్న కాలనీలోని పక్కా గృహాలను పరిశీలించారు. ఇక్కడ 250మంది లబ్ధిదారులు పక్కా గృహాలు మంజూరు అయ్యాయన్నారు. అయితే కేవలం 60మంది మాత్రమే పక్కా గృహాలను నిర్మించుకుంటున్నారన్నారు కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు ప్రారంభం

పగిద్యాల: శ్రీరామనవమి తిరనాలను పురస్కరించుకుని స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం 6 పళ్ల సైజ్ విభాగం వృషభాల బండలాగుడు పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, గ్రామ రైతు కమిటీ సభ్యులు సంయుక్తంగా ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లె సత్యనారాయణరెడ్డి, బూషిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.

4న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

మిడుతూరు: మండలపరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో శ్రీ రామనవమి, రంజాన్, గుడ్‌ఫ్రైడే సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర బండలాగుడు పోటీలు (ఆరుపండ్ల విభాగంలో) 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు కమతం జయరామిరెడ్డి శనివారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్ల జతకు రూ. 3వేలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. రూ. 500 ఎంట్రీఫీజు చెల్లించి టోకన్లు పొందాలని చెప్పారు. వివరాలకు సెల్ 9959435354, 9866416512, 9618446391 నంబర్లలో సంప్రదించాలన్నారు.



బండలాగుడుతున్న వృషభాలు





మాట్లాడుతున్న ఆత్మకూరు చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, నందికొట్కూరులో పొదుపు మహిళలకు చెక్కు అందజేస్తున్న మున్సిపల్ మేనేజర్ బేబి

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ఆత్మకూరు: రాష్ట్రంలో మహిళల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ అన్నారు. పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో ఆసరా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆసరా సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా పథకం మహిళలకు ఎంతో ఊరటనిస్తుందన్నారు. ఆసరా సొమ్ముతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ప్రతి ఆడపడుచు పొదుపు సంఘాల ద్వారా బ్యాంకు రుణాలు పొందివాటిని సక్రమంగా చెల్లించాలని సూచించారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో మహిళలకు రాజకీయ, ఆర్థిక అన్ని రంగాల్లో 50 శాతం పైగా అన్ని పథకాలను మహిళలకే కేటాయించారన్నారు. ఆడపడుచులు జగనన్న వెంటే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీకే మద్దతు ఇస్తూ గెలుపుకు కృషిచేస్తారని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, పొదుపు మహిళా సంఘాల సభ్యులు దరగమ్మ, పార్వతి, పరిమల, షఫివూన్, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నందికొట్కూరు: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ మేనేజర్ బేబి అన్నారు. శనివారం పట్టణంలోని సుబ్బారావుపేటలో 9, 10, 11, 26వ వార్డులో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 62 పొదుపు సంఘాలకు రూ, 39,78,503 వారి ఖాతాల్లో మూడోవ విడత వైఎస్సార్ ఆసరా పథకం కింద ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జమ చేశారన్నారు. కార్యక్రమంలో పట్టణ సమాఖ్య ప్రెసిడెంట్ ప్రమీల, మెప్మా సీఎంఎం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి సమావేశం వాయిదా

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశం శ్రీశైల దేవస్థాన పరిపాలనా భవనంలో శనివారం ఉదయం ప్రారంభమైంది. అయితే అనివార్య కారణాల వలన సమావేశాన్ని అర్ధంతరంగా వాయిదా వేశారు. శ్రీశైలదేవస్థానంలో స్వామివారి ఆలయ అర్చకుడుగా విధులు నిర్వహిస్తున్న శివనాగప్రసాద్ శనివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ధర్మకర్తల మండలి చైర్మన్, ఈఓ, సభ్యులు ఆయన మృతి పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సమావేశాన్ని వాయిదా వేశారు. అనంతరం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి మార్కాపురం ఏరియా ఆసుపత్రికి వెళ్లి ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. దేవస్థానం ఈఓ ఎస్ లవన్న ఆయన మృతి పట్ల సంతాపం తెలిపి, కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

పోలీస్ బందోబస్తు మధ్య సంత మార్కెట్ వేలం

పగిద్యాల: మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామ పంచాయతీ సంతమార్కెట్ వేలాలను శనివారం పోలీస్ బందోబస్తు మధ్య పంచాయతీ అధికారులు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పిట్టల శేషమ్మ అధ్యక్షతన జరిగిన సంతమార్కెట్, బండిమెట్ట వేలాల్లో రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించి 24 మంది పాటదారులు పాల్గొన్నారు. సంతమార్కెట్ వేలంను గ్రామానికి చెందిన హుసేన్ బాషా, బండి మెట్టను మిద్దె మోక్షం అత్యధికంగా రూ.67 వేలు పాట పాడి దక్కించుకున్నారు. వేలం పాటలు ప్రశాంతంగా ముగియడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో ఎస్ ఐ నాగార్జున , వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, ఈఓఆర్డీ పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి సమతయశోధర పాల్గొన్నారు.

'విశాఖ స్టీల్' ప్రైవేటీకరణ ఆపాలి

నందికొట్కూరు: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని నంద్యాల రోడ్డుపై విశాఖ ఉక్కు కార్మికులకు మద్దతుగా రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, జగదీష్, ముత్తు, రామకృష్ణ, వలి తదితరులు పాల్గొన్నారు.

5న 'చలో ఢిల్లీ'

వెలుగోడు: కార్మిక హక్కుల సాధన కోసం ఈ నెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు వాదం నాగమోహన్, కార్యదర్శి తాళ్ల శ్రీనివాసులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామదాస్ పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం చలో ఢిల్లీ పోస్టర్లను విడుదల చేశారు.

జీవనశైలిలో మార్పురావాలి

మిడుతూరు: నేటి సమాజానికి అనుగుణంగా మనిషి జీవన విధానంలో మార్పు ఉండాలని సీడీపీఓ కోటేశ్వరమ్మ అన్నారు. శనివారం స్థానిక మండల సమాఖ్య భవనంలో పోషణ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో దీర్ఘకాలిక జబ్బులు బీపీ, షుగర్, తదితర రోగాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ జబ్బుల బారి నుంచి బయటపడాలంటే క్రమం తప్పకుండా రాగులు, సజ్జలు, కొర్రలు, ఊదలు, జొన్నలు, ఆరికలు, సాములు, వారిగలు (మిల్లెట్స్) చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా తాజా ఆకుకూరలు, తాజా కూరగాయలు, పాలు, గుడ్డు , చేపలు తీసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్లు ఏర్పాటు చేసిన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కాయగూరల ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో ఎంఈఓ మౌలాలి, కడుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శివకుమార్ గౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకాదేవి, బీపీఏ వరలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ ఏసేపు తదితరులు పాల్గొన్నారు.



పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న అధికారులు

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడండి



జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓ బేగ్

నందికొట్కూరు: పదోతరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని నంద్యాల డిప్యూటీ ఈఓ బేగ్ సూచించారు. శనివారం ఆయన ఎంఈఓ పైజాన్నీసాబేగంతో కలిసి బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా బాలుర ఉన్నత పాఠశాల, శ్లోక హైస్కూల్స్ పది పరీక్షల కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో మురుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

పగిద్యాల: ఈనెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ సుభాన్ సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎగ్జామ్ చీఫ్, డిపార్టమెంటల్ ఆఫీసర్స్, ఇన్వీజిలేటర్లకు ఎంఈఓ ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎగ్జామ్ చీఫ్‌లు సలీంబాషా, నాగరమేష్, డిపార్ట్‌మెంటల్ అధికారులు దర్గయ్య, మహ్మద్‌రఫీ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

మిడుతూరు: పది పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పరీక్షల నిర్వహణ అధికారులకు ఎంఈఓ మౌలాలి ఆదేశించారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా పరీక్షల నిర్వహణ అధికారులతో కలిసి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆదర్శ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షల నిర్వహణ అధికారులు సలీంబాషా, మోహన్‌రావు, జెడ్పీ పాఠశాల హెచ్ఎం శివజ్యోతి పాల్గొన్నారు.

పది పరీక్షలకు 480 మంది విద్యార్థులు

జూపాడుబంగ్లా: పదోతరగతి వార్షిక పరీక్షలను మండలం వ్యాప్తంగా 8 పాఠశాలల నుంచి 480 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ మోహన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జూపాడుబంగ్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కనకయ్యకొట్టాల జిల్లా పరిషత్ నుంచి 33 మంది విద్యార్థులకు పాములపాడు సెంటర్‌కు కేటాయించారని చెప్పారు. మండ్లెం జడ్పీహెచ్ఎస్ నుంచి 45 మంది విద్యార్థులకు నందికొట్కూరులో సెంటర్ వేసినట్లు తెలిపారు.

కబడ్డీ విజేత కృష్ణారావుపేట

పాములపాడు: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని మండలంలోని తుమ్మలూరు గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో కృష్ణారావుపేట జట్టు విజేతగా నిలిచింది. సర్పంచు వరప్రసాద్ టాస్ వేసి పోటీలు ప్రారంభించారు. పోటీల్లో 8 జట్లు పాల్గొన్నాయి. హోరా హోరిగా సాగిన ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.5,016 కృష్ణారావుపేట జట్టు, రెండవ బహుమతి నగదు రూ.2,016 తుమ్మలూరు జట్లు కైవసం చేసుకున్నాయి. సర్పంచు విజేత జట్లకు నగదును అందజేశారు.



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచు వరప్రసాద్